శుక్రవారం 16-08-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 426 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



మీ రుణమాఫీ పచ్చి అబద్ధం

మిగతా 2లో



ప్రతి సంవత్సరం పాములు పట్టే పోటీ

మిగతా 3లో



చైనాలో పెళ్లిళ్లు జరగట్లేదు

మిగతా 3లో



40వేలకు పైగా ప్రాణాలు తీసిన యుద్ధం

మిగతా 4లో



# ఎర్రకోటపై మోడీ రికార్డు


- 11వ సారి జాతీయ పతాకం ఆవిష్కరణ
- రెడ్ ఫోర్ట్‌పై ఎగిరిన మువ్వన్నెల జెండా
- అడుగడుగునా తనిఖీలు, నిషేధించిన డ్రోన్లు

ముందడుగు ఢిల్లీ:
భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం వరుసగా ఇది 11వ సారి. 2014 ఆగస్టు 15వ తేదీ నుంచి ఇప్పటివరకు ఆయన వరుసగా రెడ్ ఫోర్ట్‌పై మువ్వన్నెలను రెపరెపలాడించారు.

ఎర్రకోటకు చేరుకున్న వెంటనే త్రివిధ దళాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం త్రివర్ణ పతకాన్ని ఎగురువేశారు. ఆ సమయంలో హెలికాప్టర్లు ద్వారా పూల వర్షం కురిపించారు. జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తోన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా 2047 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటిని అందుకోవడానికి రూపొందించుకున్న భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను వివరిస్తోన్నారు.
అంతకుముందు తన అధికారిక నివాసం నుంచి బయలుదేరిన ప్రధాని మోడీ.. నేరుగా రాజ్‌ఘాట్‌కు చేరుకున్నారు. అక్కడ జాతిపిత మహాత్మాగాంధీ సమాధికి నివాళి అర్పించారు. అనంతరం ఎర్రకోటకు చేరుకున్నారు. అక్కడ మోడీకి పలువురు కేంద్రమంత్రులు, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్వాగతం పలికారు. త్రివిధ దళాల నుంచి గౌరవ వందనాన్ని అందుకున్న తరువాత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనటు చోటు చేసుకోకుండా ఉండటానికి ఢిల్లీ పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. నగర వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.
ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరింపజేశారు. డ్రోన్లను ఎగురవేయడాన్ని నిషేధించారు. రెడ్ ఫోర్ట్‌కు దారి తీసే మార్గాల్లో జామర్లను అమర్చారు. వాహనాలను దారి మళ్లించారు.

## ఎర్రకోటలో రాహుల్ గాంధీని అవమానించారు

రెండో వరుసలో కూర్చోపెట్టారంటూ కాంగ్రెస్ ఆగ్రహం



ముందడుగు ఢిల్లీ:
ఢిల్లీ ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అవమానించారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. చివరి నుంచి రెండో వరుసలో ఒలింపిక్ క్రీడాకారుల మధ్య ఉన్న సీటులో ఆయనను కూర్చోపెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేబినెట్ మంత్రికి సమానమైన హోదా ఉన్న ప్రతిపక్ష నేతకు ప్రాధాన్యత ప్రకారం ముందు వరుసలో సీటు కేటాయిస్తారన్న విషయాన్ని గుర్తు చేసింది. ప్రధాని మోదీ చిల్లర మనస్తత్వానికి ఇదే సాక్ష్యమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే విమర్శించారు. 'చిన్న మనస్తత్వం ఉన్నవారి నుంచి పెద్ద విషయాలు ఆశించడం వ్యర్థం. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఐదో వరుసలో కూర్చోబెట్టడం ద్వారా మోదీ తన నిరుత్సాహాన్ని ప్రదర్శించారు. అయితే రాహుల్ గాంధీకి ఎలాంటి పట్టింపులేదు. ప్రజల సమస్యలను ఆయన లేవనెత్తుతూనే ఉంటారు' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే మీరు, మీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, ప్రతిపక్ష నాయకుడి పట్ల ఎలాంటి గౌరవం లేదన్నది ఇది నిరూపిస్తున్నదని మండిపడ్డారు.

కాంగ్రెస్ నాయకుడు వివేక్ తంఖా కూడా దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ కార్యక్రమాలను రాజకీయం చేయడానికి రక్షణ శాఖను మీరు అనుమతించలేరంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌పై మండిపడ్డారు. అయితే 2014 తర్వాత ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతిపక్ష నేత పాల్గొనడం ఇదే తొలిసారి.

## రుణమాఫీ చేశాం.. రాజీనామా చేయాలి

లేదంటే రైతాంగానికి క్షమాపణ చెప్పాలి ■ హరీశ్‌రావుకు సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్



ముందడుగు తెలంగాణ:
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేరని, రుణమాఫీ చేస్తే సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ చేశారు. రుణమాఫీ అమలు చేశాం. హరీశ్‌రావు రాజీనామా చేయాలి లేదంటే తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలి. అమర వీరుల స్తూపం వద్ద

మిగతా 2లో

ముందడుగు
శుక్రవారం, 16-08-2024, హైదరాబాద్

# రుణమాఫీ చేశాం.. రాజీనామా చేయాలి



(మొదటిపేజీ తరువాయి)

ముక్కు నేలకు రాయాలి. తాను విసిరిన సవాల్‌ను వెనక్కి తీసుకుంటున్నట్టు హరీశ్‌రావు చెప్పాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మూడో విడత రైతు రుణమాఫీ సందర్భంగా.. 'సాగుకు జీవం.. రైతుకు ఊతం' పేరుతో ఖమ్మం జిల్లా వైరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

''వరంగల్ వేదికగా తెలంగాణ రైతులకు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రూ.31వేల కోట్లతో రుణమాఫీ చేశాం. ఖమ్మం గడ్డ కాంగ్రెస్ అడ్డా. ఖమ్మం జిల్లా రైతాంగానికి అండగా నిలిచేందుకే ఈ ప్రాంతానికి వచ్చా. 2026 పంద్రాగస్టు లోపు సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి ఖమ్మం జిల్లాలోని 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. రెండు పడక గదుల ఇళ్ల పేరిట కేసీఆర్ మోసం చేశారు. మేం నియోజకవర్గానికి 3,500 చొప్పన ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం. ఆరు గ్యారంటీల అమలుకు నిరంతరం కష్టపడుతున్నాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# మీ రుణమాఫీ పచ్చి అబద్ధం

## రూ.2లక్షల రుణమాఫీలో రైతులెంతమంది ▪ రేవంత్‌రెడ్డి విమర్శలపై హరీశ్‌రావు కౌంటర్

ముందడుగు హైదరాబాద్:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై చేసిన విమర్శలను బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తిప్పికొట్టారు. ''దేవుళ్లపై ఒట్టు పెట్టుకొని మాట మీద నిలబడక పోగా.. నిస్సిగ్గుగా భారాస, నాపై విమర్శలు చేస్తున్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజు కానుగా డిసెంబరు 9 నాటికి రూ.40వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పారు. అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికలకు ముందు మరో నాటకానికి తెరలేపారు.

సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్ధమే అతని లక్షణం. మేము మొదటి దఫాలో రూ.లక్ష రుణమాఫీ చేస్తేనే 35లక్షల మంది



రైతులకు రూ.17వేల కోట్లు అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటారా? రూ.17,869 కోట్లు మాత్రమే అవుతాయా? ఈ ఒక్క విషయంతోనే మీ రుణమాఫీ పచ్చి అబద్ధం అని తెలిపోయింది. మీరు దగా చేశారన్నది స్పష్టంగా తేలిపోయిన తర్వాత రాజీనామా ఎవరు చేయాలి?. రేవంత్‌రెడ్డి ఏ దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పారో ఆ దేవుళ్లందరి వద్దకు స్వయంగా నేనే వెళ్తా. ఆయన చేసిన తప్పు తెలంగాణ ప్రజలకు ముప్పుగా మారొద్దని ప్రార్థిస్తా'' అని హరీశ్‌రావు తెలిపారు.

# స్వీట్లు పంచుకున్న మహిళా జవాన్లు

## భారత్ సరిహద్దులో అరుదైన వేడుక



ముందడుగు జాతీయం:

భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో దేశ స్వాతంత్ర్య దినోత్సవం సంధర్బంగా అరుదైన సంఘటన జరిగింది. ఇరు దేశాలకు చెందిన మహిళా జవాన్లు తొలిసారి సాంప్రదాయ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడంతోపాటు స్వీట్లు పంచుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం ఉదయం గెడే సరిహద్దులోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) పోస్ట్ సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది. 32వ బెటాలియన్‌కు చెందిన ఆరుగురు బీఎస్ఎఫ్ మహిళా జవాన్లు, బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ)కు చెందిన మహిళా సైనికులు కలుసుకున్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకోవడంతోపాటు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దు దళాల మధ్య పరస్పర గౌరవం, స్నేహభావానికి ఈ సాంప్రదాయం ప్రతీక అని 32వ బెటాలియన్ బీఎస్ఎఫ్ కమాండెంట్ సుజీత్ కుమార్ తెలిపారు. అయితే ఇరు దేశాల సరిహద్దు దళాలకు చెందిన మహిళా సైనికులు ఈ వేడుకలో పాల్గొనడం తొలిసారి అని వెల్లడించారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత ఆ దేశంలో ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో 4,000 కిలోమీటర్ల సరిహద్దులో హై అలర్ట్ కొనసాగుతున్నది.

# రేవంత్‌రెడ్డి సోదరులను ఏ ప్రజలు గెలిపించారు?

- ప్రభుత్వంలో కరెంట్ ఉంటే వార్త
- పార్టీకి ద్రోహం చేసిన వారికి ప్రజలే బుద్ధి చెప్తుతారు
- బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



ముందడుగు హైదరాబాద్:

కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు పోతే వార్త.. రేవంత్ వచ్చాక కరెంట్ ఉంటే వార్త. రుణమాఫీ సభకు రావాలని రాహుల్ గాంధీని ఆహ్వానించారు. రుణమాఫీ కాలేదని తెలుసుకొని రాహుల్ గాంధీ రాలేదు. కల్యాణ లక్ష్మి కింద ఇవ్వడానికి బంగారం దుకాణాలు దొరకలేదా? ఆడ పిల్లలకు రేవంత్‌రెడ్డి 2.5లక్షల తులాల బంగారం బాకీ ఉన్నారు. రేవంత్‌రెడ్డి సోదరులను ఏ ప్రజలు గెలిపించారు? రేవంత్ బామ్మర్ది కంపెనీకి రూ.వెయ్యి కోట్ల పనులు ఇచ్చారు. కవిత జైలులో ఉంటే అన్నగా నేను ఢిల్లీ పోయి కలవొద్దా? కవిత కేసు విషయంపై న్యాయవాదులతో మాట్లాడవద్దా? బిజెపితో ఒప్పందం ఉంటే కవిత 150 రోజులుగా జైల్లో ఉంటుందా? ఒక్క కాంగ్రెస్ నేత అయినా జైల్లో ఉన్నారా? త్వరలో కేసీఆర్ పార్టీ కార్యక్రమాలు ఇస్తారు. కొద్ది రోజుల్లోనే కేసీఆర్ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తారు. కేసీఆర్ పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్టుకు రేవంత్ వెళ్లి రిబ్బన్ కట్ చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లని బీసీ డిక్లరేషన్‌లో చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు పెడతారు. భాజపా నేతలు.. కాంగ్రెస్, రేవంత్ చెప్పినట్టే నడుచుకుంటున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరగలేని పరిస్థితి వస్తుంది'' అని కేటీఆర్ అన్నారు.

పార్టీకి ద్రోహం చేసిన వారికి నాలుగేళ్ల తర్వాత ప్రజలు బుద్ధి చెబుతారని, త్వరలో స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక వస్తుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఉప ఎన్నికలో భారాస నుంచి రాజయ్య గెలుపు ఖాయమన్నారు. హైకోర్టులో తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశిస్తున్నామని, మిగతా వాళ్లపై నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు.

ముందడుగు
శుక్రవారం, 16-08-2024, హైదరాబాద్



## ప్రతి సంవత్సరం పాములు పట్టే పోటీ

### పొడవైన పాములు పడితే లక్షల్లో బహుమతి

ముందడుగు డెస్క్:
ఫ్లోరిడా ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ కమిషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టులో పాములు పట్టే పోటీని నిర్వహిస్తారు. ఈసారి ఆగస్టు 9న మొదలైన ఈ పోటీలు ఆగస్టు 18తో ముగియనున్నాయి. దీనిలోభాగంగా హంటర్స్.. ఎవర్‌గ్లేడ్స్ ప్రాంతంలోని బర్మీస్ పైతాన్‌లను పట్టుకోవాలి. అవి 18 అడుగుల పొడవు, 200 పౌండ్ల వరకు బరువూ ఉంటాయి. 2000 సంవత్సరంలో ఎవర్‌గ్లేడ్స్ నేషనల్ పార్క్‌లో మొదటిసారి వీటిని గుర్తించారు. అయితే అవి అక్కడికి ఎలా చేరాయనే దానిపై స్పష్టత లేదు. ఇక అప్పటినుంచి అక్కడ వాటి సంతతి భారీగా పెరిగింది.

#### 100గుడ్లు పెట్టే పైతాన్

ఒక ఆడ పైతాన్ ఒకేసారి 100 గుడ్లు పెట్టగలదు. ఎవర్‌గ్లేడ్స్‌లోని తేమతో కూడిన ఉష్ణమండల ప్రాంతం వాటి వృద్ధికి దోహదం చేస్తోంది. దాంతో అవి దక్షిణ ఫ్లోరిడాకు విస్తరించాయి. వాటి తాకిడి వల్ల స్థానిక జీవివైవిధ్యంపై ప్రభావం పడింది. ఈ పర్యావరణ సంక్షోభం నుంచి ఆ ప్రాంతాన్ని బయటపడేసేందుకు అధికారులు 'ఫ్లోరిడా పైతాన్ ఛాలెంజ్'ను తీసుకువచ్చారు. ఆ పాముల జాతిని తగ్గించేందుకు ఈ పోటీల ద్వారా ప్రజలను భాగస్వాముల్ని చేస్తున్నారు. ఇందులో పాల్గొనేవారు వాటిని హింసించకుండా చంపివేయాలి. ఈవిషయమై శిక్షణ కూడా ఉంటుంది. ఫ్లోరిడాలో జీవహింస వ్యతిరేక చట్టాలు ఉన్నప్పటికీ.. కొన్నేళ్లుగా ఈ పోటీలు నడుస్తుండటం గమనార్హం.

#### మూడు కేటగిరిల్లో పోటీలు

అనుభవం లేనివారు, నిపుణులు, మిలటరీ.. ఇలా మూడు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఎక్కువ లేక అత్యంత పొడవైన పైతాన్‌ను పట్టుకున్నవారికి నగదు బహుమతి దక్కుతుంది. ఎక్కువ పైతాన్లు పట్టుకున్న వ్యక్తికి 10వేల డాలర్ల వరకు అందనుంది. మొత్తంగా 25వేల డాలర్ల వరకు వివిధ కేటగిరీల్లో ప్రైజ్‌లు అందిస్తున్నారు. 2023లో జరిగిన పోటీలో 209 పైతాన్‌లను చంపివేశారు. ఇదిలాఉంటే.. ఆగస్టు నెల వీటి హంటింగ్‌కు కీలకం. ఈ వేసవికాలంలో సూర్యాస్తమయం తర్వాత అవి చురుగ్గా ఉంటాయి. దాంతో వాటిని గుర్తించడం తేలికగా మారుతుందని అధికారులు వెల్లడించారు. అయితే ఈ పోటీపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక రకాల పాముల్ని చంపే అవకాశం ఉందని కొన్నివర్గాల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

## చైనాలో పెళ్లిళ్లు జరగట్లేదు

- వివాహవ్యవస్థకు కీలక మార్పులు
- కొన్ని నిబంధనలను తొలగించిన ప్రభుత్వం

ముందడుగు చైనా:
చైనాలో రోజురోజుకు పెళ్లిళ్ల సంఖ్య తగ్గిపోతుంది. వివాహ వ్యవస్థను బలోపేతం చేయడానికి అక్కడి ప్రభుత్వం నడుం బిగించింది. తాజాగా పెళ్లిళ్లకు సంబంధించిన చట్టాల్లో కీలక మార్పులు తెస్తూ డ్రాఫ్ట్‌ను విడుదల చేసింది. పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లకు ఇప్పటి వరకు ఉన్న ప్రాంతీయ నిబంధనలను తొలగించింది. హౌస్‌హోల్డ్ రిజిస్టర్ అవసరం లేదని పేర్కొంది. కుటుంబ వ్యవస్థకు అనుకూల సమాజం నిర్మించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించింది.



#### తగ్గుతున్న పెళ్లిళ్లు..

విడాకులను తగ్గించేందుకు వీలుగా వీటిల్లో కొన్ని ప్రతిపాదనలు ఉన్నాయి. విడాకులకు 30 రోజుల కూలింగ్ పీరియడ్‌ను కూడా ఇవ్వాలని పేర్కొంది. జంటలో ఏ ఒక్కరైనా విడాకులకు ఇష్టపడకపోతే.. వారు దరఖాస్తును వెనక్కి తీసుకోవచ్చు. ఆ తర్వాత విడాకుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేస్తారు. ఈ డ్రాఫ్ట్‌పై సెప్టెంబర్‌లోగా ప్రజలు అభిప్రాయాలు తెలపాలని ప్రభుత్వం కోరింది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో చైనాలో 34.3 లక్షల మంది పెళ్లిళ్లు చేసుకొన్నారు. గతేడాదితో పోలిస్తే 4,98,000 తక్కువ. 2013 తర్వాత ఇంత తక్కువ స్థాయిలో పెళ్లిళ్లు జరగడం ఇదే తొలిసారి.

#### వివాహం చేసుకుంటే రాయితీలు

గతేడాది కూడా చైనాలో వివాహాల రేటును పెంచేందుకు ఓ ప్రాజెక్టును మొదలుపెట్టారు. దీని కింద సరైన సమయంలో యువతీయువకులకు పెళ్లి అయ్యేట్లు చూడటం, పిల్లల బాధ్యతలను భార్యభర్తలు పంచుకొనేలా చేయడం, పెళ్లికూతుళ్లకు చెల్లించే అధిక కట్నాలు అడ్డుకోవడం, ఇతర ఆచారాలను పరిరక్షించడం వంటివి చేపట్టారు. మరోవైపు చైనాలోని పలు రాష్ట్రాల్లో జననాల రేటును పెంచేందుకు ఆయా ప్రభుత్వాలు పన్ను రాయితీలు, గృహాలపై సబ్సిడీలు, మూడో బిడ్డను కంటే రాయితీ విద్య వంటి సౌకర్యాలను కల్పించారు. ఇక 25 అంతకంటే తక్కువ వయస్సు ఉన్న యువతులు వివాహం చేసుకొనేలా రాయితీలను కూడా ప్రకటించింది.

## ఉద్యోగినులకు ఒకరోజు నెలసరి సెలవు

### ఒడిశా ప్రభుత్వం కీలక ప్రకటన

ముందడుగు ఒడిశా:
మహిళా ఉద్యోగినుల కోసం ఒక రోజు నెలసరి సెలవు పాలసీని ప్రవేశపెడుతున్నట్లు ఒడిశా ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఇది వర్తిస్తుందని వెల్లడించింది. ఈ మేరకు కటక్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పార్వతి పరీదా ఈ కీలక ప్రకటన చేశారు. ఈ పాలసీ తక్షణమే అమల్లోకి వస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మహిళా ఉద్యోగులు ప్రతినెలా తమ రుతుక్రమంలో తొలి లేదా రెండో రోజు ఈ సెలవును తీసుకునేలా దీన్ని రూపొందించినట్లు తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్యం, శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మహిళలకు నెలసరి సెలవులపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరుగుతున్న వేళ ఒడిశా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ముందడుగు
శుక్రవారం,
16-08-2024,
హైదరాబాద్

# ప్రధానికి పిస్టల్‌ను చూపించిన మను బాకర్

## ఒలింపిక్ క్రీడాకారులను అభినందించిన మోడీ



ముందడుగు జాతీయం:
పారిస్ ఒలింపిక్స్‌లో ఒలింపిక్ పతకం సాధించిన షూటర్ మను బాకర్.. తన పిస్టల్‌ను ప్రధానికి చూపించింది. ఒలింపిక్స్‌లో వరుసగా రెండోసారి కాంస్యం సాధించిన భారత హాకీ పురుషుల జట్టు.. ప్రధానికి ప్రత్యేక కానుకనిచ్చింది. జట్టు ఆటగాళ్లంతా సంతకం చేసిన ఓ జెర్సీ, హాకీ స్టిక్‌ను మోడీకి అందించారు. ఒలింపిక్స్‌లో కాంస్యం అందుకున్న రెజ్లర్ అమన్ సెహ్రావత్ కూడా భారత జెర్సీని ప్రధానికి బహుమతిగా ఇచ్చారు. అనంతరం ప్రధాని క్రీడాకారుల మధ్య కలియదిరుగుతూ వారితో సంభాషించారు. ఒలింపిక్స్‌లో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "పారిస్ ఒలింపిక్స్‌లో ఈ యువ ఆటగాళ్లు మన జాతీయ పతాకాన్ని రెపరెపలాడించారు. 140 కోట్ల మంది భారతీయుల తరపున మీ అందరికీ అభినందనలు తెలియజేస్తున్నా. మరిన్ని కొత్త కలలు, ఆశయాలతో ముందుకెళ్దాం. వాటికి సాకారం కోసం నిరంతరం కృషి చేద్దాం" అని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష పాల్గొన్నారు. అంతకుముందు ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఒలింపిక్ అథ్లెట్ల బృందం పాల్గొన్న సంగతి తెలిసిందే. బుధవారం వీరంతా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఈ ఒలింపిక్స్‌లో భారత్ ఓ రజతం, అయిదు కాంస్యాలు గెలిచిన సంగతి తెలిసిందే. యువ షూటర్ మను బాకర్ ఏకంగా ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి సరికొత్త చరిత్రను లిఖించింది. ఈ విశ్వ క్రీడల్లో భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు పోటీపడ్డారు.

# 40వేలకు పైగా ప్రాణాలు తీసిన యుద్ధం

## గాజాలో వేలాది కుటుంబాల్లో తీవ్ర విషాదం
## మృతుల్లో చిన్నారులు, మహిళలే అధికం



ముందడుగు డెస్క్:
రెండు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం వేలాది మంది ప్రాణాలు తీయగా, ఎంతోమంది కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య ఓ వైపు కాల్పుల విరమణకు ప్రయత్నాలు జరుగుతున్నా దాడుల తీవ్రత మాత్రం ఆగడం లేదు. తాజాగా మరణాల సంఖ్య 40వేలు దాటినట్లు గాజా ఆరోగ్య విభాగం వెల్లడించింది. అందులో ఎంతమంది మిలిటెంట్లు ఉన్నారనే విషయం చెప్పనప్పటికీ.. చిన్నారులు, మహిళలు అధికంగా చనిపోతున్నట్లు సమాచారం.

### ఆసుపత్రుల్లో వందలాది చిన్నారులు..

గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న వరుస దాడులతో వేల మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల వెలుగు చూసిన ఓ ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. పుట్టిన నాలుగు రోజులకే కవల పిల్లలను కోల్పోయిన ఓ తండ్రి పడుతున్న వేదన వర్ణనాతీతం. చిన్నారుల బర్త్ సర్టిఫికేట్ తెచ్చేందుకు వెళ్లిన అతడు.. తిరిగి ఆశ్రయం పొందుతున్న శిబిరానికి వచ్చేసరికి కవలలతోపాటు భార్య కూడా ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో కన్నుమూయడం కంటతడి పెట్టిస్తోంది. ఇదొక్కటే కాదు.. సైనిక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులను చేతుల్లో పట్టుకొని తల్లిదండ్రులు మోసుకెళ్తున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. తీవ్ర గాయాలతో వందలాది చిన్నారులు ఆసుపత్రుల్లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు.

### తాగునీటి కొరత..

మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం దాడులతో గాజా నగరాలు నామరూపాలు లేకుండా పోయాయి. లక్షల మంది ఇప్పటికే నిరాశ్రయులయ్యారు. తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఔషధాలు, ఆహారం, మంచినీటి కొరత తీవ్రంగా వేధిస్తోంది. పారిశుద్ధ్యంతో పాటు ఇతర వ్యవస్థలన్నీ కుప్పకూలిపోవడంతో అక్కడి వారిని వ్యాధుల భయం వెంటాడుతోంది. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారిపైనా ఇజ్రాయెల్ దాడులు జరుపుతుండడంతో సామాన్య పౌరుల మరణాలు అధికంగా ఉంటున్నాయి.

# ఆంగ్‌సాన్ సూకీ ఇంటిని కొనేవాళ్లే లేరు

## వేలం వేసినా ఎవరూ ముందుకు రావడం లేదు



ముందడుగు జాతీయం:
మయన్మార్ కీలక నేత, నోబెల్ బహుమతి గ్రహీత ఆంగ్సాన్సూకీ ఇంటిని వేలం వేసేందుకు చేసిన మరో ప్రయత్నం విఫలమైంది. 142 మిలియన్ల డాలర్ల ధరతో ఆ నివాసాన్ని వేలంలో ఉంచగా.. కొనేందుకు ఎవరూ ముందుకురాలేదు. మయన్మార్‌లో అతిపెద్ద నగరమైన యంగూన్‌లో సరస్సు ఒడ్డున 1.9 ఎకరాల విస్తీర్ణంలో సూకీ ఇల్లు ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా వ్యవహరించిన ఆంగ్‌సూకీ తండ్రి జనరల్ ఆంగ్ సాన్ 1947లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత ప్రభుత్వం ఆమె తల్లికి ఈ రెండు అంతస్తుల భవనాన్ని కేటాయించింది. అందులోనే సూకీ 2010 వరకు 15 ఏళ్లపాటు గృహనిర్బంధంలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత 2012లో ఆ నివాసాన్ని విడిచి రాజధాని నగరం నేపితాకు వెళ్లారు. 2015 ఎన్నికల్లో సాధించిన భారీ విజయంతో జాతీయస్థాయిలో కీలక నేతగా మారారు.

# త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

## ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ముందడుగు ములుగు:
ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పండుగ వాతావరణంలో పంద్రాగస్టు కార్యక్రమాలు కొనసాగాయి.ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పి శబరిష్, ఐటిడిఏ పి.ఓ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఓఎస్డి మహేష్ బాబా గీతే, డిఎఫ్ఓ



రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్.మహేందర్ జి, ఆర్డీఓ కె.సత్య పాల్ రెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందడుగు
శుక్రవారం, 16-08-2024, హైదరాబాద్

# సై్క పౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ముందడుగు హైదరాబాద్: సై్క పౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల & అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించి చిన్నారులకు ఆట వస్తువులు, వివిధ రకాల తినుబండారాలు పంపిణి చేసి రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న సంచార జాతుల చిన్నారులతో కలసి జాతీయ గేయాన్ని ఆలపించి, వివిధ రకాల తినుబండారాలను అందించి ఘనంగా స్వాతంత్ర్యవేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాయధ్యాయులు విమల, ఉపాధ్యాయులు త్రినేత్రి, అంగన్వాడీ టీచర్ స్వర్ణలత ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్ వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సేవ సభ్యులు ఇఫ్రాన్, నేహా తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం

## యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర

ముందడుగు హైదరాబాద్: మహనీయుల కలలుగన్న ఆశయాలను నేరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ నిజాయితీతో కూడిన జీవితాన్ని అవలంభించాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడలోని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో 78వ స్వతంత్ర్య దినోత్సవ వేడుకల సంధర్బంగా పౌండర్ రాజేంద్ర పల్నాటి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ గ్రామాలలో, కళాశాలలో విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసే బాధ్యతను యూత్ ఫర్ యాంటీ కరప్షన్ తీసుకుందన్నారు. దానితో పాటు నిజాయితీ అధికారులను, నాయకులను గుర్తించి వారిని నేటి తరానికి పరిచయం చేసే బాధ్యతను యూత్ ఫర్ యాంటీ కరప్షన్ తీసుకుందన్నారు. ఈ వేడుకలలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సలహాదారులు డాక్టర్ రవిశంకర్, అశోక్ కుమార్, డాక్టర్ స్రవంతి, మీడియా కార్యదర్శి జయరాం, డా. స్నిగ్ధ, గీత, కొన్నె దేవెందర్, వరికుప్పల గంగాధర్, కొమటి రమేష్ బాబు, బత్తిని రాజేష్, రమేశ్, కొక్కుల ప్రశాంత్, నాగేంద్ర పాల్గొన్నారు.




# హ్యాట్రిక్‌కు సిద్ధం



నాని, వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో వచ్చిన 'అంటే సుందరానికీ..' సినిమా అనుకున్నంత ఆడలేదు. అయితే.. వివేక్ ఆత్రేయ టేకింగ్‌పై మాత్రం ప్రశంసలొచ్చాయి. వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా 'సరిపోదా శనివారం'. ఈ నెల 29న సినిమా విడుదల కానుంది. ఇది పూర్తిగా ఒక ఫిక్షనల్ విలేజ్ నేపథ్యంలో సాగే సినిమా అని సమాచారం. ఇందులో నాని పాత్ర అత్యంత శక్తిమంతంగా దర్శకుడు డిజైన్ చేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ద్వితీయశ్రేణి హీరోల్లో నాని ముందున్నారు. రీసెంట్‌గా 'దసరా' సినిమాతో వందకోట్ల మార్కును కూడా దాటేశారు. దసరా, హాయ్‌నాన్న సినిమాలతో వెంటవెంటనే హిట్లు అందుకున్నారు. ఇప్పుడు 'సరిపోదా శనివారం' కూడా హిట్ అయితే హ్యాట్రిక్ హీరోగా అవతరిస్తారు. అందుకే ఈ సినిమాకోసం నాని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా సినిమాకూ క్రేజ్ పెంచుకుంటూ దూసుకెళ్తున్న నాని రాబోవు సినిమాల విషయానికొస్తే.. సుజిత్ దర్శకత్వంలో ఆయన ఓ పాన్ ఇండియా సినిమా చేయనున్నారు. ఆ సినిమా బడ్జెట్ వందకోట్ల పైమాటేనట. అలాగే తనకు 'దసరా' లాంటి బ్లాక్‌బాస్టర్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదేల దర్శకత్వంలో కూడా నాని ఓ సినిమా చేయనున్నాడు. ఆ సినిమా బడ్జెట్ 150కోట్లు అని టాక్.

# మిస్టర్ బచ్చన్ జెన్యూన్ రిపోర్ట్!



మాస్ హీరో రవితేజ కథానాయకుడిగా, మాస్ దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే నాయికగా నటించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రంలోని పాటలు, హీరోయిన్ అందాలు, హరీష్‌శంకర్ అగ్రెసివ్ ప్రమోషన్‌తో ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. అయితే విడుదలకు ఒకరోజు ముందే ఈ చిత్రం పెయిడ్ ప్రీమియర్స్ మొదలయ్యాయి. ఎన్నో ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య విడుదలైన మిస్టర్ బచ్చన్ ప్రేక్షకులను ఎంతవరకు అలరించిందో తెలుసుకుందాం. హిందీలో అజయ్ దేవగన్ నటించిన రైడ్ చిత్రానికి రీమేక్‌గా మిస్టర్ బచ్చన్‌ను విడుదల రెడీ చేశాడు దర్శకుడు హరీష్ శంకర్. అయతే తనదైన శైలిలో రైడ్ కథలో భారీ మార్పులు చేసి విఫలమయ్యాడు దర్శకుడు. నవ్వురాని మాస్ కామెడీతో.. హీరోయిన్ రొమాన్స్, అందాలతో రొమాంటిక్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకరావాలన్న ఆయన ప్రయత్నం బెడిసికొట్టింది. ఫస్ట్ హాఫ్‌లో ఏమీ తీశాడు.. అనిపించేలోపు ఇంటర్వెల్ వస్తుంది. ఇక సెకండాఫ్‌లో ప్రేక్షకులకు ఓపికకే పరీక్షే అని చెప్పాలి.. దిబెస్ట్ రొటిన్ సన్నివేశాలతో.. విసుగు తెప్పించే కామెడీతో.. లాజిక్.. మ్యాజిక్ ఏమీ లేకుండా చిత్రాన్ని రూపొందించడంపైనే కాన్‌స్ర్టేషన్ పెట్టాడు దర్శకుడు. ముఖ్యంగా ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌ను, ఆ ఆఫీసర్లను హరీశ్ శంకర్ ప్రజెంట్ చేసిన విధానం చూస్తే పూర్తి హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఇక హీరోయిన్ భాగ్యశ్రీని కేవల అందాల ప్రదర్శనకే పరిమితం చేశాడు. ఈ సినిమాలో వున్న సిద్దు జొన్నలగడ్డ ఎంట్రీ అతని కామియో కాస్త రిలీఫ్ నిస్తుంది.